# నాకీ జీవితం వద్దు...

శ్రీసుభా



*తప్పుచేయనివారు ప్రపంచంలో అరుదు. తప్పు అంటే ఏమిటి అన్నది వేరొక ప్రశ్న. చేసిన తప్పు గాక, ఇదీ తప్పు అన్న ఒకరి భావనే ఎప్పుడూ ప్రాధాన్యం సంతరించుకొంటూ ఉంటుంది. కనుకనే తప్పొప్పుల తేరీజులో అధికమైన సానుభూతి లోపించినప్పుడు మానవ సంబంధాలు కలుషితం కాక మానవు. కలకాలం కలిసి ఉండవలసిన భార్యాభర్తలకు అది మరీ ముఖ్యం కాదా*

---

**కో**ర్టు హాల్లోంచి బయటికి వచ్చి కారులో కూర్చుంది శారద. తల భారంగా ఉంది. అలాగే సీటును ఆనుకుని కళ్ళు మూసుకుంది. ఇంతలో లాయర్ సావిత్రి వచ్చి ముందు సీటులోకూర్చుని కారు స్టార్టు చేసింది.

"శారదా." నెమ్మదిగా పిల్చింది సావిత్రి.

"నేను భయపడ్డాను—నువ్వు 'క్రాస్ ఎగ్జామినేషన్'కు సరిగా నిలబడగలవో, లేవోనని. ఎలాగయితేనేం నాక్లయింటు వనిపించుకొన్నావు .." సావిత్రి పొగడ్డం మొదలు పెట్టింది. తన క్లయింట్ ధీమాగా ఎదుటి లాయర్ ధాటికి నిలబడి నెగ్గుకు రావడం ఏ లాయరుకైనా గర్వంగానే ఉంటుంది.

"మీ ఆయన చూశావా శారదా, ఎలా పీపోయాడో మన ప్రశ్నలకు..."

శారదనుంచి జవాబురాకపోవడం చూసి సావిత్రి కారు వేగం తగ్గిస్తూ అడిగింది:

"అలా ఉన్నావేం శారదా?"

"ఏం లేదు....."

"ప్రకాశ్, చిట్టీ గురించి ఆలోచిస్తున్నావా?"

శారద ఏమీ జవాబు చెప్పలేదు.

"దాన్ని గురించి నువ్వేం బాధపడకు శారదా. పిల్లలతో ఆయనెంతకాలం వేగగలడో మనమూ చూద్దాం. ఈ వేళ 'నాపిల్లలు నా దగ్గరే ఉండా' అన్న సరదా రేపు వాళ్ళ అమ్మకావాలి, అమ్మ కావాలి అంటూ మారాం చేస్తేగాని తెలియదు.. నాలుగు రోజులనాటికి మనింటికి తీసుకు వచ్చి దిగబెడతాడు చూడు..."

"వాళ్ళు బెంగపెట్టుకుంటారేమో సావిత్రీ" చీకట్లోకి అనుమానంగా చూస్తూ అడిగింది

శారద.

సావిత్రి నవ్వింది. "అదేనే మనకూ కావల్సింది. అలాగయితేనే మీ ఆయన దారికివస్తాడు."

కారు పోర్టికోలో ఆగింది. శారద నెమ్మదిగా లోపలికి వెళ్లి కుర్చీలో కూర్చుంది. సావిత్రి నల్లగౌను తీసి సోఫా హేండ్‌మీద పడేసి శారద పక్కనే కూర్చుంది. నౌకరు కాఫీ తీసుకువచ్చి ఇద్దరికీ ఇచ్చి వెళ్లిపోయాడు.

"శారదా." కాఫీ తాగుతూ పిలిచింది సావిత్రి.

శారద ఆలోచిస్తూండడం చూచి సావిత్రి నెమ్మదిగా శారద మొహాన్ని తనవైపు తిప్పింది. కళ్లు రెండూ చెలియలి కట్ట దాటిన సాగరంలా కన్నీటిని జారవిడిచాయి....

"ఏడుస్తున్నావా?" జవాబు లేదు. "శారదా, ఎందుకు ఏడుపు? నువ్వు చేసింది చెడ్డపనా?"

"కాదు."

"సంసార బంధం జ్ఞాపకం వచ్చిందా?" సావిత్రి నవ్వింది--అది తేలికభావమో, లేక గంభీరంగానే నవ్విందో తెలియనంతగా.

"నాకు తెలుసు, శారదా. చాలా రోజులు నరకం అనుభవించిన తర్వాత ఒక్కసారి స్వర్గ ద్వారాలు తెరిచి మనలను ఆహ్వానించినా వెళ్లడానికి మనకు కాళ్లు వెనకాడతాయి. వెనకటి అబాధలు అన్నీ మరచిపోయి 'నాది' అనే స్థలప్రభావం, భావ

# నాకీ జీవితం వద్దు...

దాస్యం మనిషిని వెనక్కు లాగుతాయి—పంచ భక్ష్య పరమాన్నాలు వస్తులున్న ఒంటికి రుచించనట్టు...."

"సావిత్రీ" దైన్యంగా అంది శారద.

"నిజం చెప్పాననా శారదా? నీ గురించి కాదులే. మనుష్యులే అంత. అందులో మన ఆడవాళ్ల సంగతి మరీ అధ్వాన్నం. ఓ పట్టాన బంధాలూ, మమతలూ, కష్టాలరూపంలో తేనెటీగల్లా మనలను వేధిస్తున్నా, ఎక్కడో ఏమూలో మధుస్పర్శ ఉందని భ్రాంతి పడుతూంటాం...."

సావిత్రి చిన్నప్పటినుంచీ విభిన్నవాతావరణంలో పెరిగిన యువతి. తల్లిదండ్రులు చేసిన గారాబం, చుట్టూరా పరిస్థితులు, ఒంటపట్టిన చదువూ, అధునాతన సంఘ ప్రభావం ఆమెలో బలీయమైన మార్పులు తెచ్చాయి. 'వివాహం అంటే విధిని వారించలేక హాలాహలాన్ని త్రాగడం' అని నవ్వుతూ వ్యాఖ్యానిస్తుంది. జీవితంలో వివాహం ప్రాముఖ్యమైన సంఘటన కాకపోగా మనిషి స్వాతంత్ర్యం హరించి, నడుము విరిగిన మనిషిగా మార్చే యంత్రమంటుంది. వివాహం చేసుకోకుండా హైదరాబాద్‌లో ప్రాక్టీస్ చేస్తూ ఉండిపోయింది.

"ఇప్పటికే ఆలస్యమయింది; పడుకో శారదా. రేపటికి అన్నీ చక్కబడతాయిలే. కొంచెం టీ త్రాగుతావా?"

"ఉహూ!"

"అయితే నే వెడుతున్నా" అంటూ సావిత్రి తన గదిలోనికి వెళ్లిపోయింది.

శారద మాత్రం అలా ఆలోచిస్తూనే ఉండిపోయింది. గదంతా నిశ్శబ్దంతో తేలుతూంది. పైన ఛాండిలేర్‌లో ఒకే ఒక్క లైట్ తనలాగే సగం కాంతితో వెలుగుతూంది. గోడమీద గడియారం శబ్దం, గుండెలో చిన్న శబ్దం-అవే మిగిలాయి గదిలో. నెమ్మదిగా లేచి కిటికీ దగ్గరికి వెళ్లింది. ఆకాశం వెన్నెలతో వెల్లవేసుకుంటూంది. నక్షత్రాలు చిత్రవిచిత్రాలుగా వెలిగిపోతున్నాయి. దూరంగా హుస్సేన్ సాగర్ మీదనుంచి చల్లని గాలి వచ్చి తగులుతూ ఉంది. పొడుగాటి వంతెన మీద దీపాల మాలలు. శారద నెమ్మదిగా హాలులోకి తిరిగింది. గడియారం పన్నెండు గంటలు కొట్టింది. శారద భయంగా కళ్లు మూసుకుంది. వెనక్కు జరిగి గోడను ఆనుకుంది. శరీరంలో ఫౌంటెన్‌లోనుంచి వెల్లుబుకినట్లు విషాదం చిమ్మింది. ఎందుకో అర్థంకాకుండా ఏడుపు వస్తూంది.

• • •

తన నవ్వంటే ఆయనకు చాలా ఇష్టం. ఆఫీసునుంచి రాగానే తను కాఫీ ఇచ్చేది. తీసుకునే వారు కారు.

"ఏం?" అనేది తను ఆశ్చర్యంగా.

"శారదా......"

"ఊ......"

"నవ్వాలి."

"ఎందుకట?"

"మీ ఇంట్లో అలవాటు ప్రకారం కాఫీలో పంచదార సున్నాగా వేయవ్. నాకేమో చాలా ఎక్కువ కావాలి. అందుకని నువ్వు కాఫీ ఇచ్చినప్పుడల్లా చిరునవ్వు నవ్వుతూ మరిపించావంటే నీకే పంచదార కలిసొస్తుంది మరి" అనేవారు.

"పొండి!" నవ్వేది తను.

"ఎక్కడికిట?"

"అబ్బ. . ." తను తిరిగి నవ్వేది ఒళ్ళు తెలియనంతగా.

"ఆగు శారదా. మరత్నాలూ ఏరుకోనీ. నవ్వుదువుగానీ." అలాపోదీ తను పెళ్లయిన కొత్తలో.

మూడేళ్ళ నవ్వులమధ్య నలిగిపోయాయి. చంద్రోదయ సాగరంలా, కనుమల్లో పుట్టి చల్లగా మెల్లగా పారే కోనేటిలా సంసారం పరుగులు పెట్టింది. ఆ మహోన్నత శిఖరాల తృప్తి, పాటిమాటువదాలి ఆనందం ప్రసాదించిన కామకలే ప్రకాశ్, చిట్టి.

తన సంసారం తలుచుకుంటే తనకే గర్వకారణంగా ఉండేది. ఎన్నో విచ్ఛిన్న సంసారాలు, భార్యాభర్తల మధ్య కీచులాటలు, గృహచ్ఛిద్రాలు-ఇవన్నీ తనకు ఒట్టి కలలనిపించేవి. కానీ—కానీ..

ఈ ఏడాది మొదలవుతూనే తనకు వింతరూపంలో దర్శనమిచ్చింది. ఏవైతే కలలని తను కొట్టి పారవేసిందో, వేటినైతే చేతకానితనంవల్ల కలిగే ఇక్కట్లని ఈసడించుకుందో అవన్నీ ముసురుకు వచ్చాయి తనమీదికి. నల్లని చీకటి తెరలు ఒక్కటొక్కటే రాలుతూ ఉంటే పిరికితనంతో భయం ముంచుకొచ్చేది. తను ఒంటరిగా అయిపోతానేమోనని చింత.

రోజా శారదా అంటూ తనను విడిచిపెట్టకుండా ఆప్యాయానికీ, అనురాగానికీ అర్థం చెప్పి; నవజీవనానికి ప్రత్యక్షరూపం ఇలాంటిదని సద్వినుర్శచేయడంలో కాక, ఆచరణలో నెగ్గిన

నాకాన్

నేటినుండి ఉబ్బసపు వ్యాధితో బాధపడనవసరంలేదు. ఈవ్యాధి నిర్మూలనకుగాను 30 సం.ల పరిశోధనా ఫలితముగా లభ్యపరచుకొనబడి పరమహంస క్రియలగు మూలికలతో తయారైన ఆయుర్వేదవుషధం. ఎంత మొండివ్యాధికైనను తక్షణమే బాధ నివారింపజేయుటయే గాక కొంతకాలము సేవించిన తిరిగి చూపెట్టదు.

8 జౌ. సీసా రు. 3—75. పోస్టేజి ప్రత్యేకము

ఇండియన్ మెడిసన్ హౌస్,

విజయవాడ—2.

Over a million copies of English Edition Sold Now published in India at much lower price

RADIO CIRCUITS

A STEP-BY-STEP SURVEY

by W. E. MILLER, M.A. (Cantab.), M.Brit. I.R.E.

Price Rs. 6.75

EASY-TO-FOLLOW CIRCUIT DIAGRAMS OF ALL TYPES OF MODERN RECEIVING SETS. BUILD YOUR OWN SET OR LEARN REPAIR OLD ONE AT NO COST. NO PREVIOUS KNOWLEDGE ESSENTIAL.

RUSH YOUR ORDER TO:

నేషనల్ బుక్ సెంటర్

హజ్రత్‌గంజ్ — లక్నో

ఆయన—ఈ నెల రోజులుగా ఇలా మారిపోయా రేం? తనెప్పుడూ ఊహించని మార్పు ఆయనలో ఇన్ని రూపాలు, ప్రశాంతసముద్రంలో దాగిన ప్రళయంలా ఉంటాయని తనేనాడయినా అనుకుందా? కసురుకుంటారు. విసుగు. ఎవరిమీదో అర్థంకాని కక్ష. ప్రకాశ్, చిట్టి కూడా ఆయనదగ్గరకు వెళ్ళి ఉండలేకపోతున్నారు. ఆ రోజు. . . .

"మా చెల్లాయి పెళ్ళిట. వెడదామా?"

"నాకు తీరిక లేదు. . . ."

"అదేమిటండీ? నాన్న మరీరమ్మని వ్రాశాడు."

"ఆయనకేం? ఏమైనా వ్రాస్తాడు. ఆయనలా నాకూ తీరిక ఉంటే బాగానే ఉండేది."

"వాళ్ళంత ఖర్చుపెట్టి పెళ్ళి చేస్తూంటే ఇక్కడ మనం........"

"ఇక్కడమనం గర్భదరిద్రంతో ఊగి పోతున్నామంటావా?"

"ఎందుకండీ అలా మాట్లాడుతారు?"

"చాల్లే—వెళ్ళు." తన కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి ఆయనలా మాట్లాడినందుకు. తనూ వెళ్ళకపోతే లక్ష్మి ఎంతబాధ పడుతుంది? ఆయన రానంత మాత్రాన తనూ వెళ్ళడం మానివేస్తే. . .అందుకే వెళ్ళింది. అక్కడ అంతా పెళ్ళి సందడిలో సంతోషంగా తిరుగుతున్నా తనకేదో లోటుగానే ఉంది. అందరూ అడగటం. మామయ్య అడిగాడు. తన కర్థం కాలేదు. ఆశ్చర్యం....

"ఏమిటి మామయ్యా?"

"అదే శారదా. ఆఫీసుపని రద్దీ అని రాని మీ ఆయన ఢిల్లీలో ఏం రాచకార్యం ఉందని వెళ్ళాడు?"

తను మాట్లాడలేదు.

"నేనూ మొదట్లో అలాగే అనుకున్నాను. కానీ, ప్రతిరోజు కూడా ఎవరో అమ్మాయి—చక్కనిదేలే—కన్నాట్ప్లేస్‌లో, రెడ్‌ఫోర్టులో, మొగల్‌గార్డెన్స్‌లో....నేను తిరిగిన చోట్లల్లా వాళ్ళూ తిరిగారు. . ."

కళ్ళలో అనుమానం, అవమానం తిరుగుతున్నాయి. తనకు మాట మాత్రం చెప్పలేదు. కనీసం ఉత్తరం కూడా లేదు.

"సంస్కారం ఉంది. చక్కదనం ఉంది. చదువు ఉంది. మనిషికి అంతకన్నా కావల్సిందేమిటి? ఎంతమంది ఆడవాళ్ళతో తిరిగినా మీ ఆయన నిప్పులాటి మనిషేమోలే..." మామయ్య వ్యంగ్యంగా అన్నాడు. పూర్వం బావను పెళ్ళాడడానికి తనొప్పుకో లేదు. ఇప్పుడు ఆయన వ్యక్తిత్వం గురించి పై మాటలు మామయ్యతోనే అంది ధీమాగా. ఇప్పుడేం చెప్పాలి? జవాబు తెలియక లోపలికి వెళ్ళి పోయింది.

రెండు రోజుల్లో తిరిగి హైదరాబాద్ వచ్చేసింది. ఏదో అర్థంకాని ఆవేదన, అనుమానపు పొరలు. . . ఆయన్ను తనేమని



'ప్రాభాత ప్రాంగణాన'
ఫోటో—ఎస్. జి. శేషగిరి (కోయంబత్తూరు-8)

ప్రశ్నించాలి? ఈ కల్లోలితమైన మనస్సును తను ఎలా అరికట్టుకునేది?

"అందరూ మీరు రాలేదని పదే పదే అడిగారండీ. నాకేం జవాబు చెప్పాలో తెలియలేదు."

"ఊఁ. . . ."

"ఏమండీ, ఈ సారి సెలవికి 'ఊటీ' వెడదామా?"

"దేనికీ వద్దు" ముక్తసరిగా అన్నారు.

తనకాశ్చర్యం. ప్రతి ఏడాదీ ఆయనే సరదా పడేవారు— ఊటీ, కొడైకెనాల్, నీలగిరి అంటూ.

ఏమిటి తన జీవితం ఇలా తిరగా మరగా పడుతోంది? ఈ వాతావరణంలోనుంచి, ఈ చిక్కుపడ్డ పరిస్థితులనుంచి తనెప్పుడు బయట పడుతుంది? రోజులు, వారాలు అలాగే అర్థ విహీనంగా దొర్లిపోతున్నాయి.

ఆ రోజు మధ్యాహ్నం తలభారంతో పడుకుంది.

"శారదా. . . ."

"ఊఁ. ..."

"త్వరగాలే. . ."

"దేనికండీ?"

"నీ నెక్లెస్ ఎక్కడ ఉంది?"

ఎందుకన్నట్టు చూసింది.

"అర్జంటుగా కావాలి—"

నిద్ర దూరంగా పోయింది. "ఏమిటండీ? మీకేమన్నా మతిపోయిందా?"

"మతిపోయి ఉంటే అడక్కుండా తీసుకునే వాడిని. ఇంకా పోలేదు. అందుకే అడుగుతున్నాను."

"మీరు అడిగిన మాత్రాన. . . ." మాటలు రావడం లేదు.

"అయితే ఇవ్వనంటావా?"

"దేనికయినా కారణం ఉండద్దూ? అసహ్యంగా ఆఖరికి ఇటువంటి పనులు. ."

"శారదా. కోపంగా అరిచాడు.

"ఏం ఉన్నమాట అంటున్నాననా? లేక పోతే నిజం చెప్పవల్సి వస్తుందనా?"

"చాల్లే నేర్చుకున్నావ్. ఇదే నన్నమాట నన్ను అర్థం చేసుకున్నది."

మరింత రెచ్చగొట్టి నట్టయింది తనకు. ఆమాట ఎలా అనబుద్ధి వేసిందో?

"అవును. అర్థం చేసుకున్నాను కాబట్టే ఇంకా ఓర్చుకుంటున్నాను.... మీదంతా మోసం. మనిద్దరం తప్ప మరేం లేదని నన్ను ఆడించారు. ప్రేమ అప్యాయత మీదగ్గరే ఎవరైనా నేర్చుకోవాలనే భ్రమతో నన్ను మోసగించారు. ఇంకా అనలయంలో పీగి పోతున్నాను కాబట్టే మిమ్మల్ని గౌరవిస్తున్నాను. కానీ ఆఖరికి నేనేం పోగొట్టుకున్నానో అని తల్చుకుంటే....."అన్ని రోజులుగా దాచి పెట్టుకున్న దుఃఖం ఆగలేదు.

"అయితే నేను నిన్ను మభ్యపెట్టానంటావా?"

"ముమ్మాటికీ."

"సరే, అయితే ఇప్పుడు నేనేం చెప్పను. ఆ రోజు వస్తే నువ్వే తెల్సుకుంటావు, ఇంతకీ..."

"ఆగండి. మీకు కావల్సిందేమిటో నాకు తెలుసు. ఆ అల్మైరాలో ఉంది తీసుకువెళ్ళండి."

ఆయనలో నిజం గుర్తించానన్న తపన్,

మనస్సులో ఉద్దేశ్యాన్ని బట్టబయలు చేశానన్న వ్యథో తెలియలేదు.

"శారదా." పిలిచినట్లు జ్ఞాపకం. తను గది లోకివెళ్లి పోయింది.

ఆ రాత్రి ఆయన అర్జంటు పనిమీద మద్రాసు వెడుతున్నానని ఆఫీసునుంచి కబురు పెట్టారు. అబ్బ. ఎవరిమీదీ అర్థం కాని కోపం. ప్రతి వస్తువూ భీకరంగా కన్పిస్తుంది. ఇల్లంతా నరకప్రాయం. పిల్లలు నాన్నా, నాన్నా అంటూ ఏడుస్తూ ఉంటే తను సముదాయించలేదు. వాళ్లను మరిపించడం కోసం సినిమాకు బయలుదేరింది.

ఆ రోజు తలుచుకుంటే తనకిప్పటికీ వెగటు. ఈ సంసారబంధంమీద ఉన్న అంతిమ ఆశను నరికి వేసింది ఆ కాళరాత్రే.

నిండు మనిషిననుకున్న తనను "నువ్వొట్టి అనాథవు. నీ కెవరూ లేరు" అని తేల్చి వేసింది-ఆ కడుపు గట్టిన నల్లని రాతి పోలిన రాత్రి.

ఇంటర్ వెల్ లైట్స్ వెలుగులో తనముందు తన భర్త. తనకేం అర్థం కాదు. పక్కనే ఎవరో యువతి. వెనక్కు తిరిగి ఫక్కున నవ్వింది. వెక్కిరించినట్టుయింది. తనను అగాధ లోయలోకి గెంటేసినట్టు తపన. ఎవరూ లేని నిర్జనప్రదేశంలో తనను ఒంటరిగా నిలబెట్టేసినట్టు. ఆమె మెడలో తన నెక్లెస్ మెరుస్తూంది. నిలువలేక ఇంటికి వెళ్లిపోయింది తను. ఆయన్ని ప్రేమించి పెళ్లాడింది ఇందుకేనా? బ్రతుకంతా భగ్నవీణయై, అపశ్రుతులు ఆలాపిస్తూ ఉంటే తను ఆకర్ణించవలసిందేనా? నాన్న కాదంటున్నా వినకుండా ఆయనకోసం భీష్మించింది. తను జీవితంలో నెగ్గాననుకుంది" ఆ రోజు. ముందుకూడా ఎప్పుడూ నెగ్గుతాననుకుంది. కానీ ఈ అపజయ పరంపర, ఈ తాకిడి తను ఊహించిందా? మనుష్యుల్లో ఇన్నిరకాల మనస్తత్వాలు. మనసు వేరు. మాటవేరు. 'నీతోనే నేను' అంటే తను మోసపోయింది. తన బి. ఏ. చదువు ఆ తెలివి అన్నీ వమ్ము అయిపోయాయి. ఇద్దరు పిల్లలతో కలకలలాడవలసిన తన సంసారం ఇలా ఒకమనిషి ప్రవర్తనతో సాదృశ్యనరకంగా మారిపోవడం వాళ్ల భవిష్యత్తు దిద్ది అభివృద్ధిలోనికి తేవలసిన తను ఇలా రోజూ శాపానికి ఏడుస్తూ ఉండి పోవడమేనా? తనకేం లోటని? విద్య ఉంది. సంస్కారం ఉంది తనకు కావాలంటే ఉద్యోగం దొరుకుతుంది. నాన్న తనకు నిమిషంలో ఉద్యోగం ఇప్పిస్తాడు. తనంటే ఇష్టం లేని మనిషితో అమాయకంగా కాపురం చేస్తూ దగ్గ బతుకు బ్రతకాల్సిందేనా? మోసాన్ని మంచితో మెలిపెట్టాలనే తన ప్రయత్నం వృథా. మంచికీ, నీతికీ నిజమయిన అర్థం తను చెప్పాలి. ఆడదికూడా. పిల్లల

# నాకీ జీవితం వద్దు...

తల్లి అయినా సరే, ఒంటిగా ఏదోవిధంగా బ్రతుకగలదు. కానీ, అవినీతికి కట్టుబడి అవమానాన్ని సహించేటంత వెర్రిదికాదు నేటి నవసమాజపు స్త్రీ. మగవాడి మోసానికి తలవంచే కాలం, గతంలో కరిగి పోయింది. మగవారి వంచనకు ఆత్మబలిదానం చేసే నికృష్టత స్త్రీజాతిలో పోయినప్పుడే వాళ్ళు మరింత రాణిస్తారు. శారదకు వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్టయ్యింది.

"శారదా."

". . ."

"పడుకున్నావా?"

"అర్ధరాత్రి పడుకోకనన్నాతిరగమంటారా?"

"ఇష్టమయితే తిరగొచ్చు. దానికేం?"

నవ్వెలా వస్తుందో తెలియదు. కోపం జ్వాలలుగా రగులుతూంది.

"ఇష్టమయినంత మాత్రాన ప్రతిహీనమయిన పనీ నేను చెయ్యాలనుకోను."

"ఎవర్ని వ్యంగ్యం..."

"ఎవర్నో అయినా మీరుభరిం చరన్నమాట."

"చాల్లే."

"నా నెక్లెస్ ఏం చేశారు."

"అది చెబుదామనే వచ్చాను."

"ఎవరికో ఇచ్చాననా...."

"కాదు. మా ఆఫీసు..."

తనకు ఒళ్లంతా జెర్రులు పాకినట్టుగా ఉంటాయి ఆ మాటలు.

"కథలు చెప్పి నమ్మించే బదులు నిజం చెప్పకూడదా."

"నన్నేం చెప్పనీయవేం శారదా? ఏమిటిలా మారిపోయావు?

తనలో అగ్నిపర్వతం ఒళ్ళు విరుచుకుంది. నమ్మి పూజించిన మనిషి మోసం చేసింది కాక, ఎదురుగా మారిపోయావంటున్నారు.

"మారిందెవరో నాకు తెలుసు. అసలు

> ## కాయ, పండు
>
> సైన్సు టీచర్: "ఒరేయి గోపీ! పిల్లల గుండెకాయకు, పెద్దల గుండెకాయకు గల భేద మేమిరా?"
>
> గోపి: "పిల్లలది కాయగాను, పెద్దలది పండుగాను ఉంటుంది, సార్!"
>
> —ఆర్. గోపాలరెడ్డి
>
> (కర్నూలు)

మిమ్మల్ని నమ్మడం నాది బుద్ధి తక్కువ. ఇంత హీనమయిన మనస్సని తెలుస్తే....ఛీ.... అవినీతి బ్రతుకు...."

చెంప ఛెళ్ళు మంది.

"చెప్పనీయకుండా ఏమిటా వాగుడు?"

"ఆ అమ్మాయి మెళ్లో ఉంది. నేను మిమ్మల్నిద్దర్నీ చూశాను..."

"వెధవ అనుమానం....ఆ అమ్మాయి..."

"మీ కెరుగరంటారు. నాకేం చెప్పనక్కర లేదు..."

"నిజం చెప్పనీయవేం?"

"ఎంతకాలం నన్ను మోసగిస్తారు? మిమ్మల్ని నమ్మినందుకే శిక్ష చాలు. ఈ దొంగ బ్రతుకు నేను బ్రతకలేను. ఆమెతో ఢిల్లీ కాదు. మీ ఇష్టం వచ్చినచోటుకు వెళ్లచ్చు."

"శారదా, నువ్వేనా మాట్లాడుతున్నది..."

"నేనే—మీకోసం ఎన్నో రోజులు ఎదురు చూచిన శారద ఈ వీడాదిలో విసిగి అంటూంది...నేనుమీమంచిమోసపోయాను. నాన్న చెప్పిన సంబంధం చేసుకుని ఉంటే ఆయునకు మనశ్శాంతి నిచ్చినదాననవుదును. ఇప్పటికైనా ..."

"అయితే..."

"ఈ బ్రతుకు...ఇలాంటి బ్రతుకు..."

"శారదా..." ఆయన తన భుజాలు పట్టుకుని కుదుపుతున్నారు. తనలో రేగిన పెను తుఫాను, దాగిన అవమానం—అన్నీ కలిసి విలయ నృత్యం చేశాయి.

"మీ కథలు నేను వినదల్చుకోలేదు...ఈ దొంగ జీవితం. ఈ జీవితం నా కొద్దు." కంఠం రుద్ధమయింది. ఆఖరి మాటలు అంటున్నప్పుడు. గబగబ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది.

అంతే. ఆ రాత్రి తనకు విధితో యుద్ధం మొదలయింది. బంగారు బ్రతుకు తన కళ్ల ముందు కరిగిపోయింది. పూలతలా ప్రాకిన మూడేళ్ల సంసారం వాడి రాలిపోయింది. తల్లి అనిపించుకున్న తను, భర్త ప్రాపులేని స్త్రీ అయిపోతూంది. నా యిల్లు అనుకునే మాట కూలిపోతూంది. వణికే చేతుల్తోనే పెట్టె సర్దింది. పిల్లల సామాన్లు సర్దుతూంది. ఐదేళ్ల క్రితం అనవసరం అని మూల పడవేసిన బి.ఏ. పట్టా తీసుకుంది. తన బ్రతుక్కు తగిలినట్టుగానే దానికీ బూడిద అంటుకుంది. నెమ్మదిగా దులిపి చూసుకుంది. రెండు కన్నీటి బొట్లు చప్పున రాలాయి. ఎక్కడో తెల్లవారుతున్నట్లుగా కోడికూత. ఆకాశంలో నల్ల తెరల వెనుక తెల్లని గుర్తులు తేలుతున్నాయి. కానీ, శారద హృదిలో ఇంకా రాత్రే మిగిలి ఉంది... నల్లని మేఘాచ్ఛాదమై.

* * *

"శారదా. నువ్వు ఉద్యోగంచేస్తానంటున్నావు.

బాగానే వుందమ్మా. కానీ, పిల్లలు చూడు. 'నాన్నా...నాన్నా' అంటూ పలవరించి పోతున్నారు. ఈ పరిస్థితిలో నువ్వు విడాకులు కోరడం..."

"నాన్నా, ఇదంతా నేను మాత్రం కోరుకున్నానా? నా జీవితం ఎప్పుడో తప్పు దారి పట్టింది. సంసారం పోయిన తరువాత, విడాకులు తీసుకున్నా నన్ను చెడ్డ పేరు వస్తే మాత్రమేం నాన్నా?"

"అది కాదమ్మా నా ఉద్దేశ్యం."

శారద కళ్లు తుడుచుకుంటూ అంది: "ఈ పరిస్థితుల్లో ఈ విడాకులే నాకు, ఆయనకు మేలుచేస్తాయేమో? అలాగేకానివ్వండి. నాకన్నా ఇది ఆయనకు ఎక్కువగా ఆనందాన్నివ్వచ్చు..."

నాలుగైదు నెలల్లో ఆయన దగ్గరనుంచి తనకు రెండు ఉత్తరాలు వచ్చాయి. తనకు కనీసం విప్పి చదువ బుద్ధి వేయలేదు. గుండె రాయి అయిన తరువాత ఈ ఉత్తరాల ఓదార్పు తన నెలాగూ ఒడ్డుకు లాగేది కాదు. అందుకే చదివేది కాదు. తన క్లాస్‌మేట్ సావిత్రి హైద్రాబాద్‌లో ప్రాక్టీస్ చేస్తూంది. వెళ్లి కలుసుకుంది. తన ఉద్దేశ్యం చెప్పింది. సావిత్రి విని చాలా మెచ్చుకుంది.

"మన దేశంలో ఈ సంఘపు కట్టుబాట్ల మధ్య నిజమైన తెగింపు, ఒకళ్లకు దడవనిది నీకు కలగడం నిజంగా ఎప్రీషియేట్ చెయ్యవలసిందే" అంది. ఏవేవో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని దగ్గర ఉండి అప్లై చేయించింది. ఆయనకు రిజిస్టర్ నోటీసు కూడా ఇచ్చింది.

నెల రోజుల అనంతరం తను ఈ రోజు కోర్టుకు వెళ్లవలసి వచ్చింది. కాళ్లెందుకో పీకిపోయాయి. ఎదురుగా ఆయన. ఏవేవో ప్రశ్నలు సావిత్రి ఆయన్ను అడుగుతూంది.... "మీరు మీ భార్యను వదిలి పరాయిస్త్రీతో తిరిగే వారు కదూ?"... "మీ భార్య నగలు ఆమెకు యిచ్చారు కదూ".... "ఏడాది మంచి మీ ఇద్దరికీ ఏవిధమైన సంబంధం లేనట్టేనా?"

అన్నిటికీ ఆయన మంచి ఒకటే జవాబు "అవు"నంటూ. తప్పే అడిగారు. ఏంచెప్పిందీ తనకే గుర్తు లేదు.

ఆఖరికి కోర్టు ప్రకాశ్‌ను, చిట్టిని తండ్రి దగ్గర వదిలిపెట్టాలని తీర్పు ఇచ్చింది. నవ మాసాలూ మోసి కన్నందుకు తల్లిగా తను వాళ్లకి ఏమీ కాలేక పోయింది. న్యాయ నిర్ణయం. వారం రోజుల్లో తనకూ ఆయనకూ ఈ భార్యాభర్తల సంబంధం తెగిపోతుంది కోర్టు ద్వారా.

ఏదో ఈ ప్రపంచానికి మూలాగా తన పిల్లలతో బ్రతకాలనుకుంటే తప్పే ప్రపంచం ఒంటరిదానిగా శపిస్తోంది. ఇదంతా తన పూర్వ జన్మ పాపఫలమా?

* * *

మరునాడు ఉద్యోగంలో చేరమని ఆర్డర్స్ వచ్చాయి. వెళ్లి చేరింది. అక్కడా ప్రశాంతత లేదు. ఏదో కొత్త. అందరూ తనను వింతగా చూస్తారు. ఇంటికి వచ్చే దారిలో సావిత్రి కలుస్తుంది. ఏ వేవో చెబుతుంది. కాని ఎక్కడో కన్పించని లోటు. ఆ రోజు సికింద్రాబాద్‌లో హఠాత్తుగా ప్రమీల కన్పించింది. ప్రమీల శారదకు ఇంటర్‌లో క్లాస్ మేట్.

ఇంటర్ పూర్తి కాకుండానే పెళ్లిచేసుకుంది. ఏవేవో అడిగింది ప్రమీల...

"మా ఇంటికిరా శారదా."

"అలాగే వస్తాను..."

"ఎక్కడ ఉంటున్నావు?"

"ఈ ఊళ్లోనే సావిత్రి దగ్గర."

"అదేమిటి, శారదా, పురిటికి గాని వచ్చావా?"

"లేదు."

"మరి..."

తనేం చెప్పాలి? ఏమని చెప్పాలి? తర్వాత కలుసుకుంటావని అడ్రస్ తీసుకుంది తను. తిరిగి రెండు రోజులు జరిగిపోయాయి. రేపు. రేపు కోర్టులో తన సంసార బంధం... బుర్రంతా వేడెక్కిపోతూంది. ప్రశాంతత కావాలి. ఎలా దొరుకుతుంది... ప్రమీల జ్ఞాపకం వచ్చి బయలుదేరింది. వాకిలి తలుపులు తెరిచే ఉన్నాయి. నెమ్మదిగా లోపలికి వెళ్లింది. వంటింట్లో ప్రమీల వేడినీళ్లతో చేతులు కాపు పెట్టుకుంటూంది.

"రా. కూర్చో."

"అదేమిటి ప్రమీలా. ఆ దెబ్బ లేమిటి?"

"ఏం లేదు. మామూలే."

ప్రమీల నవ్వింది. "నీకర్థం కాదులే..."

"ప్రమీలా.... మీ ఆయన..."

"ఆయన మంచివారే శారదా. నా గీత బాగుండనప్పుడిలా జరుగుతూంటుంది..."

"ఇంత హీనంగానా? అయినా ఇవన్నీ నువ్వెలా భరిస్తున్నావు?"

"భరించక ఏం చెయ్యమంటావు?"

"ఎదిరించలేవా, చదువుకున్నదానివి?"

"ఎదిరించి..." ప్రమీల ప్రశ్న. తనేం జవాబు చెప్పాలి? ఆటువంటి మనుష్యుల్ని ఇంతవరకూ శారద చూడలేదు.

"జవాబు చెప్పలేక పోతున్నావు కదూ? అందుకే నేనూ ఊరుకున్నాను."

శారద గంభీరంగా అంది: "చెప్పడానికి జవాబు లేకపోవచ్చు. క్రియారూపంలో చేసి చూపించచ్చుగా?"

"ఏంచెయ్యాలిట?"

ఇదేమిటి, కాలేజీలో చదువుకున్న ప్రమీలేనా మాట్లాడుతున్నది? ఆ ప్రమీలేనా భర్త చేత దెబ్బలు తిని మరేం చెయ్యాలని అడుగుతూంది? అలాగే అడిగింది. ప్రమీల చెయ్యి కాచుకుంటూ అంది: "చదువువేరూ, జీవితం



పల్లవి

చిత్రం — వి. ఎస్. కొర్లపాటి (అంబాజీపేట)

వేరూ శారదా. ముఖ్యంగా కాపురం వేరు. అప్పుడు నువ్వొక్కదానివే. ఇప్పుడు పూర్తిఅయి అవని ఇద్దరి మనుష్యుల కలయికే వివాహిత స్త్రీ రూపం..."

"అంటే...."

"మనల్ని మనం సరిదిద్దుకుంటూ ఎదుటి వ్యక్తిని గూడా సర్దుకు రావాలి. రెండింటిలో ఏది లోపించినా మనకే నష్టం."

"అందుకని ఎన్ని దెబ్బలు కొట్టినా భరించాలంటావు."

"శారదా, నువ్వు వివాహితవు. నాకు మాటల్లో నయినా శక్తినిస్తావనుకున్నాను. ప్చ్.. ఏం లాభం? చిన్నప్పుడు మాష్టారు కొడుతున్నారని బడికి వెళ్లడం మానేస్తే ఈనాడు ఇందరు విద్యావంతులయ్యేవారేనా? ఇదీ అంతే. చిన్న గాలి వాన..."

"ఇన్ని కష్టాలు పడుతూ, ఏమిటి ప్రమీలా, ఇంకా మాటలతో నిన్ను నువ్వు మోసం చేసుకున్నది కాక..."

మాటలు పూర్తికానివ్వకుండానే ప్రమీల ఘంగున నవ్వింది...

"భార్యాభర్తలు పోట్లాడుకోవడం, చిన్న మనస్పర్ధలూ వీటిని కష్టాలంటామా శారదా? భర్త, అత్తయ్య, ఆడబడుచుల్లో ఎవళ్లో ఒకళ్లు ఆదమాయిస్తే అవన్నీ కష్టాలేనా? ప్రతి సంసారంలో ఇవి రోజూ జరుగుతూనే ఉంటాయి. ఆయన్ను నేను మోసంచేసి పెళ్లాడావని అత్తయ్య రోజూ అంటూనే ఉంటుంది. నిజం నాకూ వారికే తెలుసు. అందుకే వాటిని నేను పట్టించుకోను. మాటలతో ఘర్షణ పెరుగుతుంది తప్ప మరేం మిగలదు. అప్పుడప్పుడు ఈ సంసారం బరువు మోయలేక వారూ విసుక్కుంటారు. అవన్నిటినీ నాకు సమన్వయించుకుని నేను కష్టపడిపోతున్నాననుకోమంటావా?" గంభీరంగా

మాట్లాడింది.

శారదకేం అర్థం కాలేదు. "భర్త భార్యను మోసగించి పరాయివాళ్లతో తిరిగితేనో? నువ్వే లోకమని నమ్మించి వంచిస్తేనో? ఇవన్నీ ఏమిటి? ? ? ఏంచెయ్యాలి ప్రమీలా?" శారద ఆ మాటలంటున్నప్పుడు వణికిపోయింది.

ప్రమీల బుజ్జగిస్తూ అడిగింది: "మీఆయనా నువ్వూ పోట్లాడుకుంటున్నారా శారదా..."

ఎంతోకాలంనుంచి ఓదార్పు ఎరుగని శారదకు ఏడుపు గట్లు తెంచుకు వచ్చింది. కెరటాలు వేసే సముద్రం అయింది హృది.

అంతా చెప్పింది.

ప్రమీల ఆశ్చర్యంగా వింది. "దీనికా శారదా నీ భర్తను, నువ్వు పోగొట్టుకుంటూంట? ఈ నిర్ణయానికి వచ్చేముందు మీ ఆయనతో ముఖాముఖిగా మాట్లాడావా? నువ్వంటే ఇష్టంలేదని ఆయన నోటితో అన్నారా?"

"లేదు ప్రమీలా. మానాన్నగారింటికి వెళ్లిపోయాను. ఆయన ఉత్తరాలు వ్రాసినా చదువలేదు. జవాబివ్వలేదు."

ప్రమీల నెమ్మదిగా అంది. "శారదా, నూరేళ్ల బ్రతుకు చెరుపుకోవడం చాలాతేలికమ్మా. కానీ, నిలుపుకోవడమే కష్టం. ఏదో తాత్కాలిక మనస్పర్ధల్ని ఇంత దూరం లాక్కొచ్చి నువ్వు పొందేదేమిటి? నీ పిల్లల్ని కూడా దూరం చేసుకున్నావు. . ."

"అదే ప్రమీలా నా బాధ. వాళ్లు లేకపోతే నేను బ్రతకలేను."

"నిజమే శారదా. కానీ, ప్రకాశ్, చిట్టీ లేకపోతే ఆయనేమవుతారో ఆలోచించావా?"

శారదేం జవాబు చెప్పలేదు.

"శారదా, ఈ విడాకులు మనకు క్షేమకరం కాదమ్మా. మనతత్వానికి అది పడదు. ఈ సంప్రదాయాలూ కట్టుబాట్లూ వేరు."

"అయితే నన్నేం చెయ్యమంటావు ప్రమీలా?" శారద అడిగింది.

"శారదా, నువ్వు చెప్పిందాన్ని బట్టి మీ ఆయన్ను అర్థం చేసుకోవడం కష్టం. అంత ప్రేమించిన మనిషి ఏకారణం లేకుండా నువ్వంటే విముఖత చూపిస్తాడు?" ఆగి ఆలోచనగా అంది. . .శారదా! ఆయన రాసిన ఉత్తరాలు చదువు. ఆఖరిసారి వంటిగా కల్సుకుని నీ సంశయాలు నివృత్తి చేసుకో. . నీకు తృప్తి అనిపిస్తేనే ఆయన్ని క్షమించమని అడుగు."

"ప్రమీలా?"

"తప్పు లేదు శారదా. నీ ఇంటిని నువ్వు బాగు చేసుకుంటానంటే ఏ న్యాయస్థానం నిన్ను కాదనదు. ఎవరో నిన్ను మోసగిస్తారని భ్రమపడి నిన్ను నువ్వు మోసం చేసుకోకు."

శారద నెమ్మదిగా లేచి ఇంటికి బయలుదేరింది. రకరకాల ఆలోచనలు, ఎటూతేలని సమస్యలు. బ్రతుకు నడిబొడ్డుపై నిల్చి వికటంగా నవ్వుతూంది. తను బ్రతుకు నిలుపుకో

# నాకీ జీవితం వద్దు...

వడంతో నిలువకలుగుతుందా. నెమ్మదిగా వెళ్లి బెడ్‌లైట్ కాంతిలో భర్త వ్రాసిన ఉత్తరాలు చదువ సాగింది. గుండె వేగం హెచ్చుతూంది. మెదడంతా మనస్సులో కేంద్రీకరణ జరుగుతూంది. మనసు గతంలో పరిభ్రమణ తిరుగుతూంది.

తను ఇంతకాలం ఏం ఊహించింది? ఒక అమృతమూర్తిని నిష్కారణంగా నిందించింది. ఆయన మనస్సును శంకించింది. ఏమిటిది?

"శారదా.

అన్నీ వ్రాసి నిన్ను విసిగించ దలుచుకోలేదు. నాకూ జీవితం పట్ల ఈనాటికి రుచి తప్పింది. ఎలాగయినా ఏమయినా ఒకటే ననిపిస్తూంది. కానీ అప్పుడప్పుడు మన సంసారం, ఆ చిత్రణా కళ్లముందు మహాకావ్యంలా మెదుల్తుంది. ఆ కావ్యకాంతి తప్తత జ్ఞప్తికివచ్చి ఆ తీయని నెమరులో నేను మరింత అవిటివాణ్ణవుతున్నాను.

శారదా, నేను నీకు మోసం చేశానన్నావు. నేను దానికెలా జవాబు చెప్పను? ఆ అమ్మాయి, మా ఆఫీసరు కృష్ణమూర్తిగారి కూతురు. కృష్ణమూర్తిగారంటే నీకు తెలుసు ననుకుంటాను. నేను మనస్ఫూర్తిగా చేతులు రెండూ జోడించి నమస్కరించదగిన ఉదాత్త హృదయులు వారే. నేను చిన్నప్పటినుంచీ చదవడానికీ, ఈ నాటికి ఈ ఉద్యోగం చెయ్యడానికీ కారణం ఆయనే. ఆఖరికి నేను వారమ్మాయిని కాకుండా నీవాణ్ణవడానికి కారణం కూడా ఆయనే.

వారి అమ్మాయి నీలూ, ప్రేమఅనే భ్రాంతిలో తనేం పోగొట్టుకున్నదీ తెలుసుకోలేక ప్రియుడికోసం ఢిల్లీ వెళ్లింది. పాపం కృష్ణమూర్తిగారు పెద్ద సంబంధం కూతురుకు చెయ్యాలని మురిసిపోయాడు. ఇటు వ్యాపారం దెబ్బతింది. అటు కన్నకూతురూ దెబ్బతీస్తూంది. ఆయన నన్ను ప్రాధేయ పడ్డాడు.

జీవితంలో నాకు ఆయన చేసిన ఉపకారానికి ప్రత్యుపకారం చేసే అవకాశం అదే నన్పించింది. జీవిత పరమావధి అవధులు అందినట్టయింది. నీలూకోసం ఢిల్లీ వెళ్లాను. మోసం చేసిన ప్రియుడు. ఇంటికి రావడానికి విముఖత. అటువంటి స్థితిలో ఆమెను నేను కలుసుకున్నాను. ఆమెకు నేను చిన్ననాటి పరిచయస్థుణ్ణి. అందుకే ఎన్నో ఆశలు పెట్టాను.

> *ఒక్కరు మాట్లాడగలిగితే ఏడుగురు పాడగలరు.*
>
> —జర్మన్ సామెత

గాలిలో తిప్పాను. నెలరోజులు తీయని బ్రతుక్కు అర్థాన్ని ఊహించి చూపాను. నేను ప్రేమిస్తున్నాననుకుంది. ఆ నెలరోజూ నిన్ను బాధ పెడుతున్నానని తెలిసినా ఓపక్క వ్యాపారం మరొకపక్క, నీలూ మనస్సు మార్పిడి అర్థం కాక ఊరుకున్నాను. అలాగే నటించే వాణ్ణి.

ఈ విచిత్ర పరిస్థితుల్లోంచి నేను తప్పుకొని ఊపిరి పీల్చుకునే లోపల నేనేం పోగొట్టుకున్నానో తెలిసింది. ప్రపంచమంతా మాయామయం లేపాక బ్రతుకుతున్నట్టుగా బాధ పడ్డాను. ఇవన్నీ నీకు చెప్పాలనుకున్నాను. కానీ, శారదా, ఆరోజు వరకూ నాకు ఓ మంచి పనిచేశాననే భావన, ఓ త్యాగం చేశాననే ధీమా ఉండేవి. త్యాగానికి ప్రతిగా నా సంసారం విచ్ఛిన్నమవుతున్నదని తెలుసుకున్నాక ఆ త్యాగం పట్ల నాకు ఈర్ష్యాభావం కలుగుతూంది. నాపట్ల నాకు ప్రాముఖ్యం తగ్గుతూంది. ముందే ఆలోచించి ఉంటే ఆపని చేసే వాణ్ణి కానేమో. కాని చెయ్యి జారిపోయింది. మన ఇరువురిది చెరోక దారీ అయిపోయింది. నానుంచి నువ్వు విడాకులు కోరాలనే ఉద్దేశ్యంతో ఉన్నట్టు తెలిసింది. దాని గురించి నేనేం రాయను. నిన్ను ఇష్టం లేని పనిచేయమని నేను ప్రోత్సహించను. అది నాఅభిమతం కూడ కాదు. తుది నిర్ణయంగా నా శారద ఎలాచేసినా నాకు ఆనందమే. ప్రకాశ్, చిట్టీ ఆడుకోవాలని ఆశిస్తున్నాను.

సుబ్బారావు."

శారద భోరున ఏడుస్తూ ఉండిపోయింది. ఎందుకు తన బ్రతుకిలా అయింది. రేపు కోర్టులో తనెలా హాజరవగలదు? ఈ స్వాతంత్ర్యం వద్దు. భగవంతుడు ఎందుకిచ్చాడు ఈ కష్టాలు. సావిత్రి సినిమానుంచి అప్పుడే వచ్చింది. శారద ఏడుపు విని లేచి వచ్చింది.

"శారదా... ఏమిటి శారదా..."

"సావిత్రీ...రేపు..."

"ఏమిటే నీకేమన్నా మతిపోయిందా?"

"సావిత్రీ నేను ఆయననుంచి విడాకులు కోరుకోలేనే. ఆయన నాకు కావాలి..."

సావిత్రి అర్థంకాకుండా అంది: "ఇప్పుడేమయిందని..."

"నన్ను నేను తెలుసుకున్నాను. సావిత్రీ, ఇంతకాలం అనుభవించినదంతా శాపం. నాకు ఆయన కావాలి."

"అన్ని కష్టాలూ అనుభవించి ఇంకా ఆ జీవితం కావాలంటావా?"

"కావాలి, సావిత్రీ, నాకు నా సంసారం, పిల్లలూ కావాలి. ఆయన కావాలి. నా ఇల్లు తిరిగి సృష్టి చేసుకుంటాను. నాకీ జీవితం వద్దు..." అంది శారద — తన్ను తాను తెలుసుకున్నట్టుగా, నిండుగా.

హాలులో గడియారం పన్నెండుసార్లు గుంభనగా నవ్వింది. శారద తలెత్తి కాంతి తప్పలయిన కళ్లతో చూసింది. ★